# ప్రేమ చిత్రాలు

— శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు —

కడుపులో వెచ్చగా కాఫీ పోసుకుని, మీదిమీదికి వస్తూన్న చలిని తరిమేసి, ఉదయం ఎనిమిది గంటలికి వాలుకుర్చీలో కూచున్నాను. ఇంకా ఏపనీ మొదలెట్టలేదు. చటాలున నామిత్రుడు రామబ్రహ్మం వచ్చాడు. "నువ్వు వస్తూన్న సూచన తెలియచెయ్యకుండా వచ్చావు. నిన్ను అరెస్టు చేశాను" అన్నాను అతనితో హాస్యంగా. "నీ అరెస్టుకి నేను బద్ధుణ్ణే గాని మొట్టమొదట ఈ సమస్య తీర్చు" అన్నాడు రామబ్రహ్మం. "అలాగు కూచో, మాట్లాడదాం" అని మరొక వాలుకుర్చీ చూపించి "ఏమిటి చెప్పు, మరేం తొందర అంశం కాదు కదా!" అన్నాను.

"అబ్బే! కొంప మునిగిపోయే దేమీ లేదు! ఒక విషయంలో నీ సహాయంకోసం వచ్చాను."

"అలాగా? చెప్పు విందాం" అని వినడానికి సిద్ధపడ్డాను.

"ఒక ప్రేమవిషయం చెబుదామని వచ్చాను. భగవదనుగ్రహం బాగుంటే—"

"ఔనుగాని నీ కూతురికి పదిహేనేళ్లు వచ్చాయికదా, ఇంకా పెళ్లిచెయ్యవేం? నీ వాలకం నాకేం అర్థం కావడం లేదు. నువ్వు చూస్తే నిత్యాగ్నిహోత్రిని తలదన్నే నిష్ఠ కలవాడివి, నీ చర్య చూస్తే నవీనసంస్కారుల్ని తలవంచుకో చేస్తూంది. ఏమిటి సంగతి?" అన్నాను ఆశ్చర్యంగా.

రామబ్రహ్మం సూక్ష్మంగా "మా ఆవిడే కారణం" అన్నాడు.

"ఏం" అని, మరింత ఆశ్చర్యపడ్డాను.

"అది చిన్నపిల్లలప్పుడు తన పిల్లలికి పెళ్లి చెయ్యనియ్యదు. పిల్లల పెళ్లిలో మనకి జోక్యమేమీ ఉండకూడదు. వాళ్లంతట వాళ్లే పెళ్లి చేసుకోవాలి. అ దెంతంటే అంతే కాబట్టి నే నేం చెయ్యలేను" అన్నాడు రామబ్రహ్మం రవ్వంత విరక్తిగా.

"ఊఁ. నువ్వు ఒప్పుకున్నావన్నమాటే!"

"దాని మాటకి తిరుగులేదు."

"ఆవిడ ఇలాగ పట్టుపట్టడానికి కారణ మేమిటో!" అని నాలో నేను అనుకున్నట్టుగా అన్నాను.

"చెబుతాను, వింటావా? ఓపిగ్గా వినాలిసుమా కథంతా!"

నేను కుతూహలంతో చూశాను ... ... ... ... రామబ్రహ్మం కథ చెప్పాడు. అతను తనపక్షం విషయాలే సరిగా చెప్పాడు. కాని ఎదిరిపక్షం విషయాలు సబబుగా ఊహించలేకపోయాడు. అంచేత కథ ఒక పెడమాత్రమే చెప్పినట్టు ఉంది. అతను తిన్నగా ఊహించని అంశాలు నేను ఊహించి కథ పూర్తిగా చెబుతున్నా.

ఉమాకాంతం రాజమహేంద్రవరం వచ్చాక ఇల్లు మారడం ఇది పదోసారి. అతను బొంబాయి ఆర్టు స్కూలులో చదువు ముగించి రాజమహేంద్రవరం వచ్చి రెండేళ్లయింది. ఇల్లుగల ఆసాములు అతన్ని ఒక కొంపనుంచి మరొక కొంపకి తరుముతున్నారు. అతనికి ఇల్లు మారడమంటే బెంగలేదు. కాని చిత్ర పటాల గతేమిటి? ఇల్లు మారినప్పుడల్లా బొమ్మలు కాస్తో కూస్తో నలిగిపోతున్నాయి. కిందటిసారి ఇల్లు మారేటప్పుడు ఆల్ ఇండియా ఆర్టు ఎగ్జిబిషన్ కోసం రాస్తూన్న 'పార్వతీప్రణయా'న్ని జాగ్రత్తగా కొత్త ఇంటికి రవానా చేసేటప్పటికి తలప్రాణం తోక కొచ్చింది. 'భద్రాచల దృశ్యం' మీద గీతలు పడ్డాయి. 'కృష్ణరాయల స్వారి' చట్రం విరిగి పోయింది. బొమ్మలతో తగని బాధ వచ్చి పడింది! ఇంటి ఆసాములు అతన్ని ఎందుకూ తరమడం? అతను వాళ్ల కొంపల్లో నూతిదగ్గిర గలీసు చేశాడనా, లేక దెబ్బలాడేడనా, లేక తమ ఆడవాళ్లని కామ దృష్టితో చూశాడనా? ఎందుకూ తరమడం? "ఇదా ఈ మనుష్యులు కళకి ఇచ్చే ప్రోత్సాహం! మనిషి బతికి ఉన్నన్నాళ్లూ కాల్చుకు తింటారా? చచ్చేక పద్యాలు రాస్తారా, వర్ధంతులు చేస్తారా, బొల్లే డ్పులు ఏడుస్తారా? ఇదా వీళ్లు చేసే పని!" అంటూ ఉమాకాంతం అనేకసార్లు పళ్లుకొరికి, గుప్పిళ్లు బిగించి తనలో అనుకున్నాడు; "ఒక స్త్రీ నా ఇంటికి వస్తే ఏమిటి? ఆమెని నేను వలచి రమ్మన్నానా? ఆమె మొగుడికి తెలియకుండా నా ఇంటికి వస్తూందా? నేను నెలకి నాలుగురూపాయిలు ఇస్తున్నా, ఆ కాప అమ్మాయి వచ్చి కూచోడానికి. నాబొమ్మలు నేను గీసుకుంటాను. గుడ్డలేకుండా ఆమె కూర్చుంటూన్న మాట నిజమే. ఆమెకీ, ఆమెమొగుడికీ ఇష్టం లేక పోవాలిగాని మధ్య మీకా దద్దమ్మలికి ఇష్టం లేక పోడం! మీరు ఇళ్లలోంచి పొమ్మంటే నేను నా చిత్రకళ మానుకుంటా ననుకున్నారా? తెలివితక్కువ పీనుగులు!" అని అనేకసార్లు తనలో తాను ఉపన్యాసాలు ఇచ్చుకున్నాడు. ఇటువంటి ఉపన్యాసాలు పైమను ష్యులికి ఇవ్వడంవల్ల తాను మరింత రవ్వపడిపోతా నని ఎరిగి తనలో యుక్తివాదాలు చెప్పుకుంటూ, ఉప న్యాసాలిచ్చుకుంటూ శాంతి పొందేవాడు.

మొట్టమొదటిసారి అతను అద్దెకి ఉన్న ఇంటికి ఎదురుగుండా ఒక కట్టెలుకొట్టేవాడు ఉండేవాడు. కొన్నాళ్లకి అతనితో పరిచయమయింది. ఉమాకాంతం స్కెచ్‌బుక్కు పట్టుకుని, తనతో మాట్లాడుతూన్న ఆ కట్టెలుకొట్టే అబ్బి బొమ్మ క్షణంలో గీసి "ఇదిగో నువ్వు" అని చూపించాడు. ఆ అబ్బి ఆ బొమ్మ చూసి నివ్వెరపోయి "నేనే అండీ. ఎంతబాగున్నానండీ! అచ్చం నేనేనండీ!" అని ఆ పుస్తకం ఇంట్లోకి తీసికెళ్లి పెళ్లానికి చూపి చంకలు కొట్టుకుని, ఇంటిచుట్టూ ఉన్న స్నేహితులికి చూపించి గంతులు వేసి, పుస్తకం మాపి పట్టుకొచ్చి ఉమాకాంతానికి ఇచ్చి, తన కా బొమ్మ ఇమ్మనీ, పటం కట్టు కుంటా ననీ కోరాడు. ఉమాకాంతం ఒప్పుకు న్నాడు. ఆ అబ్బి ఆబొమ్మని పటం కట్టించి తీసుకు వచ్చి ఉమాకాంతంతో "తమరు ఇచ్చారు కామట్టి తమ రేదేనా సెప్పండి శాత్తాను." అన్నాడు మొహం బిగించి, బుర్ర అడ్డంగా ఊపుతూ. అందుకు ఉమాకాంతం "నేను బొమ్మలు గీసుకోడానికి ఇరవై యేళ్ల అమ్మాయి కావాలి. ఆఅమ్మాయి నిలుచున్నప్పుడు, కూచున్న ప్పుడు, వంగున్నప్పుడు, ఇంకా అనేక మోస్తర్లుగా ఉంచి నేను బొమ్మలు గీసుకుంటాను. ఈ చిత్రకళ వృద్ధి చేసుకోవడానికి అది అవసరం. నాకు ఊరికే రా నక్కర్లేదు. నెలకు నాలుగు రూపాయి లిస్తాను. పగలు ఏదోసమయాన్ని వచ్చి కూచుని పోవాలి" అన్నాడు.

కట్టెలు కొట్టే అబ్బి రెప్పపాటుకాలం విస్తుబోయి ఇంట్లోకి ఒక్కగంతులో వెళ్లి, మళ్లీ ఇవతలికి వచ్చి "మా ఆడోళ్లొత్తారండి, తమరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు" అన్నాడు. "రేపటినుంచి రమ్మను" అని ఉమాకాంతం వెళ్లిపోయాడు.

నూకమ్మ, అంటే కట్టెలు కొట్టే అబ్బి పెళ్లాం, ఆమన్నాడు ఉమాకాంతంయింటికి వచ్చింది. ఆమెను కూచోబెట్టి ఉమాకాంతం కొంచేంసేపు బొమ్మలు గీసుకుని వెళిపొమ్మన్నాడు. ఆ అమ్మి రోజూ వస్తూండేది. అతిత్వరితంగా చుట్టుపట్లవాళ్లు

రంకు కట్టేశారు. ఇంటాయన ఉమాకాంతాన్ని లేచి పొమ్మన్నాడు. ఉమాకాంతం వాదన పెట్టుకోక మరోఇల్లు చూచుకున్నాడు. కొన్నాళ్లకి అక్కడా ఇదే తంతు. ఈమోస్తరుగా ఇప్పటికి పదో ఇల్లు మారడం. ఎంతమంది ప్రయత్నించినా కట్టెలు కొట్టే అబ్బి మట్టుకు తన పెళ్లాన్ని ఉమాకాంతంఇంటికి పంపడం మానలేదు.

ఈపదకొండో అద్దెయింటికి ముందు ఉమాకాంతం 'లలితకళానికేతనం' అనే బోర్డు కొత్తమోస్తరుగా రాసి తగిలించాడు. కేటాయింపుగా ఉన్న తన ఇంటి భాగంలో ముందుగదిలో కొన్ని బొమ్మలు అలంకరించి, అంతగా వెలుతురురాని వెనకగదిలో మరికొన్ని బొమ్మలు చక్కగా అమర్చాడు. పెరట్లో కొన్ని పూలకుండ్లు ఉన్నాయి.

ఆ వీథిలో ఉన్న యువక విద్యార్థులు ఉమాకాంతంఇంటికి నూకమ్మ వచ్చిపోవడం చూస్తున్నారు. హఠాత్తుగా ఒకరోజున వాళ్లు ఉమాకాంతం ఇంటికి ఎదురుగా నడివీథిలో సభ తీర్చారు. అవసరం మాలిన మాటలు అతన్నిగురించి మాట్లాడుతున్నారు. ఉమాకాంతం మనకెందుకని ఊరుకున్నాడు. మన్నాడు కూడా ఆ విద్యార్థులు అదేవేళకి సభ తీర్చారు. ఉమాకాంతం మనస్సులో విచారించి "తెలుగువాళ్లు ఇంత మర్యాదలేనివాళ్లా! అయ్యో! ఇటువంటివాళ్లనా నేను ప్రేమిస్తూన్నది" అని అనుకున్నాడు. మూడో రోజున యువకులు సభ చేస్తూ, ఇంట్లోంచి వస్తూన్న నూకమ్మని ముట్టుకోబోయారు. ఉమాకాంతం ఇవతలికి వచ్చి "మీరు మర్యాదగా ప్రవర్తించండి. అమర్యాద మనుష్యులనిపించుకోడం గొప్పతనం కాదు." అన్నాడు, కోపాన్ని తొక్కిపెట్టి. విద్యార్థులలో ఒకడు లేచి "ఈయనట, మనకిట, మర్యాద నేర్పుతాడుట." అన్నాడు చేతు లాడించుకుంటూ. విద్యార్థులంతా ఘక్కున నవ్వారు. "మీరు ఇక్కడ ఎందుకు చేరుతున్నారు రోజూ?" అని అడిగాడు ఉమాకాంతం. "తమ రుంచుకొన్న అమ్మాయిని బాగుచేద్దామని" అన్నాడు ఒక పోఖిరీ. "ఆవిషయం నన్నడగవద్దు. ఆ మనిషిభర్తని అడగండి. అతను చెప్పినట్టు ఆమె ప్రవర్తిస్తుంది" అన్నాడు ఉమాకాంతం నిదానంగా. సభ్యులంతా గొల్లుమంటూ లేచారు; ముందు వెళుతూన్న నూకమ్మని పకపకనవ్వుతూ, కేకలేసుగుంటూ వెంబడించారు; ఆమెఇంటికి వెళ్లి ఆమె భర్తని పిలిచి అతనితో నానామాటలూ అన్నారు. అందుకు ఆ అబ్బి చెప్పవలసిన సంగతులన్నీ చెప్పి "నేను ఇష్టపడే పంపుతున్నాను" అన్నాడు. ఒక్క విద్యార్థినోరూ పిగలలేదు. "ఇది లాలోచీవ్యవహారంరా, ఎవడి ఇష్టం వాడిదిరా, ఎవడికొంప వాడు ముట్టించుకుంటే మనకేంరా" అనుకుంటూ చల్లగా పప్పులా జారారు. ఆ నాటినుంచీ సభలు జరగలేదు.

విద్యార్థులు సభ తీర్చేటప్పుడు ఎదుటి వరసలో మూడోఇంటి గుమ్మంలో నిలుచుని సావిత్రి చూస్తూండేది. సభలు ముగింపయ్యేయి. ఒకరోజున నూకమ్మ వస్తూండగా సావిత్రి తన ఇంటిగుమ్మంలో నిలుచుని సిగ్గుతో చిరునవ్వు నవ్వుతూ, నూకమ్మని పిలిచి, ఆమెని గురించీ, ఉమాకాంతాన్నిగురించీ ప్రశ్నలు వేసింది. నూకమ్మ తను చేసే పని చెప్పి, ఉమాకాంతాన్ని గురించి "ఉమాకాంతంగారికి తల్లీ తండ్రీ లేరు. ఆయన చంటిపిల్లడై ఉన్నప్పుడే వాళ్లు చచ్చిపోయారు. మేనత్త పెంచి పెద్దచేసి, చదువు చెప్పించింది. ఆవిడా నాలుగేళ్లకిందట చచ్చిపోయింది. ఆయన ఒక్కరే ఉన్నారు. హోటేలునుంచి తిండి తెప్పించుకు తింటారు. ఇంకా పెళ్లికాలేదు. బొమ్మలు చాలా బాగా గీస్తారు" అంది. "అలాగా" అంది సావిత్రి ఆశ్చర్యంతో. పరువుమర్యాదలులేని నూకమ్మతో అంతకంటే ఎక్కువసేపు మాట్లాడకూడదని తలచి ఇంట్లోకి వెళ్లిపోయింది.

ఆ మన్నాడు సాయంత్రం నూకమ్మ ఉమాకాంతంఇంట్లోంచి కోడిపుంజుని చంకని పెట్టుకు ఇవతలికి వచ్చింది. తన ఇంటి గుమ్మంలో నిలుచున్న సావిత్రి ఆమెని చూసి, ఆపి "కోడిపుంజు నెందుకు తెస్తున్నావు? ఆయన తింటా రేమిటి?" అంది. అందుకు నూకమ్మ నవ్వి "వారు బ్రాహ్మలు. వారు కోళ్లని తింటారా? బొమ్మవేస్తూ కోడిపుంజుని తెమ్మన్నారు. పట్టుకెళ్లాను" అంది.

"ఏంబొమ్మ వేస్తున్నారు?" అంది సావిత్రి బిడియంతో.

"గౌతముడు, కోడిపుంజు బొమ్మ వేస్తున్నారు. గౌతముడి పక్కనే మెరిసిపోతూ అహల్య నిల్చుంది. చీకట్లోకూడా ఆ యమ్మ తళతళ మెరిసిపోతూంది" అంది నూకమ్మ, ఖాళీగా ఉన్న ఎడం చెయ్యి తిప్పుకుంటూ.

"అహల్యా, గౌతముడూ నిజంగానే ఉన్నారా ఏమిటి ఆ గదిలో?" అంది సావిత్రి అమాయికంగా.

"వాళ్లు కాదమ్మా! వాళ్ల బొమ్మలు. అంచక్కా ఉంటాయి. మనుష్యు లనుకోవలసిందే" అంది నూకమ్మ ఆనందంతో.

"ఎంత బాగుంటాయో?" అంది సావిత్రి ఆశ్చర్యపడి.

"చాలా బాగుంటాయి. అచ్చం మనుష్యులే! ఆ అహల్యమ్మని చూసితీరాలి. ఎంత చక్కగా ఉంటుం దమ్మా! మెరుపులాగ!" అంది నూకమ్మ కళ్లు తిప్పుకుంటూ. సావిత్రి ఆలోచనలో ఉండిపోయింది. నూకమ్మ ఇంటికి వెళిపోయింది. ఉమాకాంతం సాయంత్రం షికారు బయలుదేరాడు. కలకత్తాఅంచు పంచ కుచ్చిళ్లుపోసి కట్టాడు. షర్టు మీద కాఫీరంగుకండువా వల్లెవాటువేసుకుని, కళ్లకి నల్ల షెల్ ఫ్రేమ్ తగిలించి, కాళ్లకి కలకత్తా స్లిప్పర్లు తొడిగి బయలుదేరాడు. సావిత్రి అతన్ని చూసి సిగ్గుపడి ఇంట్లోకి వెళిపోయింది.

మర్నాడు ఉమాకాంతం నూకమ్మని "ఆ యింటిదగ్గిర ఎవరితో మాట్లాడుతున్నావు?" అని పూరికే అడిగాడు. "సావిత్రితో మాట్లాడుతున్నాను" అంది నూకమ్మ. ఉమాకాంతం ఆ అమ్మాయినిగురించి కొన్ని ప్రశ్నలు అడిగాడు. నూకమ్మ ఊరుకోక "మీరు బొమ్మల్లో వేసే మోస్తరుగా ఉంటుంది ఆ అమ్మాయిగారు" అంది. అతను ఆశ్చర్యపడ్డాడు. "ఆ పిల్లని చూడాలి నూకమ్మా!" అన్నాడు. మరి కొంతసేపటికి నూకమ్మ ఇంటికి వెళిపోతూండగా తన ఇంటి మెట్లమీద నిలుచున్న సావిత్రి ఆమెని ఆపి "మీ అయ్యగారు పిచికని వెయ్యగలరా? అంచక్కా వెయ్యాలి మరి" అంది. నూకమ్మ చిరునవ్వు నవ్వి "రేపు పట్టుకొస్తా, చూడండి" అంది. మర్నాడు నూకమ్మ గూట్లో పిల్లలికి పిచికలు తిండి పెడుతూన్న బొమ్మని పట్టుకొచ్చింది. సావిత్రి ఆబొమ్మని చూసి ఆశ్చర్యపడిపోయింది. "మీ అయ్యగారు పిచికల్ని పుట్టిస్తా రమ్మోయి!" అంది. అని ఆ యింట్లోబొమ్మ లన్నిటినీ చూడాలమ్మా!" అంది కోరికతో. ఇంతలో ఇంట్లో సవితితల్లి పిలవగా పిచికలబొమ్మని ముద్దెట్టుకుంటూ లోపలికి వెళిపోయి, బొమ్మని పెట్లో దాచేసి, సవితితల్లిదగ్గిరికి వెళ్లింది.

మర్నాడు నూకమ్మ రాగా ఉమాకాంతం ఆమెతో "నువ్వు పిచికలబొమ్మ తీసుకు వెళ్లి ఇచ్చిన పిల్ల ఎవరు?" అని అడిగాడు.

"ఎదుటివరసలో మూడో ఇంట్లో అమ్మాయి; మిమ్మల్ని గురించి ప్రశ్నలు వేస్తూంటుంది"

"నన్ను గురించా?" అని ఆశ్చర్యపడ్డాడు.

"మరే! మిమ్మల్ని గురించే".

"ఎన్నేళ్ల పిల్ల?"

"పదకొండేళ్ల పిల్ల"

"కళ్లు చక్కగా ఉంటాయి, నేను బొమ్మలు గీసినట్టే ఉంటుంది అన్నావు ఆఅమ్మాయేనా ఏమిటి?"

"ఔను! ఆ అమ్మాయే. సావిత్రి"

"ఇంకా పెళ్లి కాలేదూ?" అని ఉత్తేజం పొందిన మొహంతో అడిగాడు ఉమాకాంతం.

"లేదు" అంది నూకమ్మ.

ఉమాకాంతానికి చిరునవ్వు వచ్చింది. "నిన్న పిచికల బొమ్మ చూసి ఏమంది ఆ అమ్మాయి?" అన్నాడు చిట్లింపుమొహంతో.

"మీఅయ్యగారు నిజమైన పిచికలే వేస్తారే అంది."

ఉమాకాంతానికి సావిత్రిమీద కుతూహలం కలిగి "ఆ పిల్లతల్లిదండ్రు లిక్కడే ఉన్నారా?" అని ప్రశ్న వేశాడు.

"తండ్రి ఉన్నాడు. తల్లి సవతితల్లి. సవతితల్లి బాధ లుండనే ఉంటాయి. పిల్లమట్టుకు మంచిది. అందాల భరిణ. ఎవళ్ల ఇంట్లో పడుతుందో ఏమిటో!" అంది నూకమ్మ ఉద్రేకరహితంగా.

ఉమాకాంతానికి చిరునవ్వు వచ్చింది. అతను దాచలేకపోయాడు; "అలాగా?" అనుకున్నాడు. ఇంక సంభాషణ ఆపి, నూకమ్మని స్టూలు బల్లమీద కూచోమని, బొమ్మలు గీసుకొని, మరి కొంతసేపటికి వెళిపొమ్మని తాను సావిత్రిని గురించి గాలిమేడలు కడుతూ కూచున్నాడు. నూకమ్మ ఇంటికి పోతూ స్నేహితురాలైనసావిత్రిని కేకవేసింది. సావిత్రి ఇవతలికి వచ్చీరావడంతోనే నూకమ్మతో "మీ అయ్యగారు వేసిన బొమ్మలు చూడనిస్తారా?" అంది, ఆ ప్రశ్న వేద్దామని అంతకి ముందే ఆలోచించుకొని. "మా అయ్యగారి నడిగి చెప్తా" అంది నూకమ్మ. ఇంట్లోంచి సవతితల్లి ఇవతలికి వచ్చింది. నూకమ్మ వెళ్లిపోయింది. "ఆ రంకుముండతో మాట్లాడుతున్నావా? మీ నాన్నతో చెప్పి ఛీరించేస్తాను ఉండు" అంది ఆవిడ. సావిత్రి మొహం ముడుచుకుని మాట్లాడకుండా పిల్లి లాగ గదిలోకి వెళిపోయింది.

మన్నాడు నూకమ్మ తిరిగి ఇంటికి వెళిపోయే టప్పుడు సావిత్రిఇంటిగుమ్మందగ్గిర ఆగింది. సావిత్రి ఇవతలికి వచ్చి "మాఅమ్మకి కనపడకుండా మాట్లాడేం. లేకపోతే మా అమ్మ కోంబడుతుంది" అంది.

"ఏం?" అంది నూకమ్మ.

"అదంతా ఎందుకూ? మనం మాట్లాడుకోడం మా అమ్మకి తెలియనియ్యొద్దు ...... మీ అయ్యగారి బొమ్మలు ఎప్పుడూ చూడడం?" అని అడిగింది.

"రేపు నాతో రండి చూపిస్తా" అంది నూకమ్మ. సావిత్రి సంతోషించింది. నూకమ్మ వెళిపోయింది.

నూకమ్మ ఆ మన్నాడు పెందరాడే వచ్చింది. ఆమెకోసం అనుక్షణం ఎదురు చూస్తూన్న సావిత్రి నూకమ్మని చూసి బ్రహ్మానందపడి ఆమెతో కలిసి ఉమాకాంతంఇంటికి వెళ్లింది.

ఉమాకాంతంఇంట్లో ముంగుగదిమధ్యని ఒక నల్లబల్లమీద చిన్న పువ్వులగుడ్డ పరిచి దానిమీద ఒక చలువరాతిసింహం పెట్టిఉంది. ఆ సింహం పక్కని చిన్న కంచు కూజాల్లో పువ్వు లున్నాయి. నేలమీద జింఖానాలు ఉన్నాయి. గోడలమీద అందంగా పెద్ద పటాల పక్కని చిన్నపటాలు అమర్చబడ్డాయి పౌరాణికచిత్రపటాలు కొన్ని, చారిత్రక చిత్రపటాలు కొన్ని, సాంసారికపటాలు కొన్ని, రంగులపటాలు కొన్ని, రేఖాచిత్రాలు కొన్ని, నలుపు తెలుపు కొన్ని-రకరకాలుగా అమర్చి ఉన్నాయి. కుడివైపున గోడ మీద ఉన్న 'శకుంతల విహారం' బొమ్మ చూస్తూ సావిత్రి తన్మయత్వం పొంది నిలుచుంది. పెరట్లోంచి వస్తూన్న ఉమాకాంతం ఆమెని చూసి ఒక విగ్రహం లాగ నిలబడ్డాడు. నూకమ్మ ఎంత వర్ణించినా తను సావిత్రిని అలాగ ఊహించుకోలేకపోయానుకదా అని అతను ఆశ్చర్యంతో నిలుచున్నాడు. కొంతసేపటికి సావిత్రిదృష్టి పక్కకి మళ్లగా ఉమాకాంతం కన బడ్డాడు, సిగ్గుతో పరిగెత్తబోయింది. ఉమాకాంతం పెరట్లోకి వెళిపోయాడు. నూకమ్మ సావిత్రితో "అయ్యగారు పెరట్లోకి వెళిపోయారు. మీరు చూడొచ్చు చాలాసేపు" అంది. సావిత్రి మరికొంచెం సేపు చూసి "నువ్వు నాతో చెప్పిన అహల్యబొమ్మ ఏదీ?" అని అడిగింది. నూకమ్మ ఆపటాన్ని చూపించింది. సావిత్రి ఆశ్చర్యపడిపోయి నిలుచుని కొంతసేపు చూసి ఆనందించి తటాలున "మాఅమ్మ కోంబడుతుంది, వెళిపోవాలి" అని వెళిపోయింది. ఉమాకాంతం పెరట్లో పళ్లచెట్ల నీడలలో సంచరిస్తూ సావిత్రిఅందం తలపోసి ఆనందిస్తున్నాడు.

ఒకరోజున నూకమ్మ తన పని ముగిసినపిమ్మట ఇంటికి పోతూండగా సావిత్రి ఆమెని ఆపి "ఈ గ్రాఫు కాగితంమీద మీ అయ్యగారిని లేడిని సింహం తరుము తూన్నట్టు బొమ్మవేసి ఇమ్మను. నేను ఈ కన్నాల అట్టమీద ఊలుతో కుట్టుకుంటాను" అంది. మరి రెండు రోజులికి నూకమ్మ ఆ గ్రాఫుకాగితం తీసుకొచ్చి సావిత్రికి ఇచ్చింది. సావిత్రి ఆ కాగితం మీద ఉన్న రంగులు గల ఊలుతో కన్నాల అట్టమీద బొమ్మ కుట్టి నూకమ్మకి ఇచ్చి "మీ అయ్యగారికి చూపించి రా" అంది. ఉమాకాంతం ఆ బొమ్మని చూసి అపరిమితానందం పొంది, ఆమెలలితకళాభిరుచిని మెచ్చుకొని, దానికి చట్టం కట్టించి తిరిగి పంపించాడు. సావిత్రి ఆ చట్టం చూసి సంతోషించి పటాన్ని ఇంట్లో వేళ్లాడగట్టింది. ఆరాత్రల్లా ఉమా

కాంతాన్ని గురించే చక్కని కలలు కంటూ నిద్ర పోయింది.

మరొకరోజున నూకమ్మ ఇంటికి పోతూండగా సావిత్రి పిలిచి "మీ అయ్యగారికి కరివేపాకుపచ్చడి ఇస్తాను. నువ్వు ముట్టుకోకుండా తీసికెళతావా?" అంది.

"నేను ముట్టుకోకుండా ఎలాగ తీసికెళతానమ్మా!" అంది నూకమ్మ నవ్వుతూ.

"మరిచిపోయాను. ఆయనికి ఎలాగా ఇయ్యడం?" అని సావిత్రి మథనపడింది.

అందుకు నూకమ్మ "బ్రాహ్మల హోటేళ్లలో కాపమనుష్యులే పచ్చళ్లు చేస్తూంటారు. మాఅయ్యగారు భోంచేసే హోటేలులోనూ అంతే. అంచేత నేను తీసుకెళ్లి ఇస్తాను. ఫర్వాలేదులెండి" అంది.

ఎలాగో ఒహలాగ పచ్చడి అందాలని సావిత్రి నూకమ్మచేతికి ఇచ్చింది.

ఉమాకాంతం ఆ పచ్చడి తిని అపరిమితానందం పొందాడు.

తన పని పూర్తిచేసుకొని ఒకనాటి సాయింత్రం నూకమ్మ ఇంటికి పోతూ సావిత్రిఇంటిదగ్గిర ఆగింది. నూకమ్మకోసం ఎదురుచూస్తూన్న సావిత్రి నూకమ్మ రాగానే ఒక్కగంతులో ఆమెదగ్గరికి వెళ్లి "మీ అయ్యగారు ఇంట్లో ఉన్నారా?" అంది. "ఉన్నారు. మీ బొమ్మ రాసి ఇమ్మన్నారా?" అంది నూకమ్మ. "నన్ను తిన్నగా చూడలేదు కదా, ఎలాగ రాసిస్తారు?" అంది సావిత్రి ఆశ్చర్యంతో, సిగ్గుతో.

"రేపు మాగదిదగ్గిరికి రండి, మీ బొమ్మ చూద్దురుగాని" అంది నూకమ్మ. అని, వెళిపోయింది.

సావిత్రి ఆశ్చర్యపడుతూ, ఉవ్విళ్లూరుతూ ఆ రాత్రి గడిపింది. మన్నాడు మధ్యాహ్నం నూకమ్మ పెంద్రాడే వచ్చింది. సావిత్రి మంచి పరికిణీ కట్టుకొని, నూకమ్మతో కూడా ఉమాకాంతంఇంటికి వెళ్లింది. నూకమ్మ సావిత్రితో మాట్లాడుతూండగా పక్కని కిటికీలోంచి చూస్తూన్న ఉమాకాంతం సావిత్రిని రేఖాచిత్రంగా గీశాడు. నూకమ్మ ఆ బొమ్మ తీసుకువచ్చి సావిత్రికి చూపించింది. సావిత్రి ఆ బొమ్మలో ముక్కుపుడక వెయ్యడం కూడా చూసి ఆశ్చర్యపడి ఆనందించింది. ఆమె అలాగ ఆనందిస్తూన్నట్టుగా మరొక బొమ్మ వేశాడు. నూకమ్మ సావిత్రికి ఆ బొమ్మ చూపించింది. సావిత్రి ఆ బొమ్మని చూసి దిగ్భ్రమచెంది "ఆయన ఇక్కడే ఉన్నారమ్మా!" అంటూ సిగ్గుపడి పారిపోయింది. ఉమాకాంతంనూకమ్మని వెళిపొమ్మని చెప్పి సావిత్రిని గురించి ధ్యానిస్తూ, సంతోషపడుతూ, పెరట్లో చెట్లనీడల్లో తిరిగాడు.

సావిత్రి కాగితపుసంచీలో పువ్వులు పోసింది. ఆ మధ్యాహ్నం నూకమ్మ వచ్చేటప్పుడు ఆమెని ఆపి "ఈ పువ్వులు మీ అయ్యగారికి ఇయ్యి" అని ఇచ్చింది. నూకమ్మ ఉమాకాంతానికి ఆ సంచీ ఇచ్చింది. అతను ఆ సంచీ అందుకొని పువ్వులు వెలుపుతూండగా ఒక కాగితం ఇవతల పడింది. నూకమ్మకి కనపడకుండా ఆ కాగితం తీసి దాచి పెరట్లోకి వెళ్లి సావిత్రి రాసిన ప్రేమలేఖని ఇరవైసార్లు చదువుకొని గుండెలకీ, కళ్లకీ అద్దుకొని, ఆమెని పెళ్లిచేసుకునే విధానమేమిటీ అని ఆలోచిస్తూ కూచున్నాడు.

ఒక పండగరోజున నూకమ్మతో సావిత్రి ఉమాకాంతంఇంటికి వచ్చింది. నూకమ్మ ఏదో పని మీద పెరట్లోకి వెళ్లగా రెండోగదిలో ఉన్న ఉమాకాంతం ఇవతలకి వచ్చి సావిత్రిని కౌగలించి ముద్దుపెట్టుకొని "మన వివాహం ఎప్పుడూ" అని అడిగాడు. సావిత్రి అతని కౌగిలిలోంచి విడిపించుకోబోగా ఉమాకాంతం ముద్దుపెట్టుకొని గులాబీపువ్వులు జడలో పెట్టి కౌగిలి విడిచిపెట్టాడు. సావిత్రి ఇంటికి పోయి జడ, బొట్టు సర్దుకుని గులాబీపువ్వులు చూసి ఆనందపడి, జడలో పెట్టుకుంది. రాత్రి నిద్రలో ఉమాకాంతాన్ని వివాహమాడినట్టు కలలు కంది.

ఉమాకాంతం సావిత్రియొక్క జీవితపు సైజు తైలవర్ణపటం వేస్తున్నాడు. మధ్య మధ్య సావిత్రి రాగా ఆమెని మరింత పరీక్షచేసి పటం పూర్తి చేస్తున్నాడు. పటం ముద్దులుమూటకడుతూంది. సావిత్రి ఎదుట నిలుచున్నట్టుగానే ఉంది ఆబొమ్మ. ఆబొమ్మ పూర్తి అయాక గదిలో కిందని వేళ్లాడగట్టాడు.

ఒకనాడు సావిత్రి ఒంటరిగానే ఉమాకాంతం గదికి వచ్చింది. ఉమాకాంతం ఆమెని కౌగిలించుకొని రెండో గదిలోకి తీసుకువెళ్లి అక్కడ వేలాడిఉన్న బొమ్మని చూపించాడు. సావిత్రి కొంచెంసేపు చూసి,

"మా ఇంట్లోనూ ఉంది నిలువుటద్దం, మామామ కొనిచ్చాడు" అంది.

"ఇంతేసి నిలువుటద్దాలు మీ ఇంట్లో ఉన్నాయా?" అన్నాడు ఆశ్చర్యం అభినయించి.

"ఇంతకంటే పెద్దవి ఉన్నాయి"

"ఈ నిలువుటద్దంలో నువ్వేకాని నేను కనపడ నేమి!"

సావిత్రి తడిమి చూసింది. అది అద్దం కాదు. బొమ్మ! తనబొమ్మ! సావిత్రి సిగ్గుతో ఉమాకాంతం చేతుల్లో వాలిపోయింది. అతను ఆమెశరీరంమీద ముద్దులుకురిపించాడు. సావిత్రి మేలుకొని ఉమాకాంతం చేతుల్లోంచి విడిపించుకొని కాళ్లు తడబడుతూండగా, తల సర్దుకొని ఇంటికి వెళిపోయింది.

మరికొన్ని రోజులకి ఆమె మరొకసారి ఉమాకాంతంఇంటికి రాగా, ఉమాకాంతం ఆమెని కాగిలించుకొని రెండోగదిలోకి తీసుకువెళ్లాడు. గోడమీద ఉన్న బొమ్మని చూసి ఆశ్చర్యపడి, సిగ్గుపడింది సావిత్రి; తన్ను ఉమాకాంతం కాగిలించుకున్నట్టుగా ఆబొమ్మలో ఉంది.

"ఈ బొమ్మ బాగుందా?" అన్నాడు.

సావిత్రి సిగ్గుపడుతూ "అప్పటిదానికంటే బాగుంది ఎంతో" అంది.

ఉమాకాంతం కాగిలి విడిచిపెట్టేశాడు. బొమ్మలోకూడా ఇద్దరూ వేరయారు. "ఇప్పు డెలాగ ఉంది" అన్నాడు అతను.

ఇది అద్దంకాని బొమ్మ కాదని గ్రహించి ఆ అమ్మాయి సిగ్గులో మునిగిపోయి, ఉమాకాంతం చేతుల్లో వాలింది. ఉమాకాంతం ఆమెని ముద్దుపెట్టుకొని తివాసీమీద తన పక్కనే కూచోబెట్టుకుని, ఆమె నిలుచున్నట్టు, కూర్చున్నట్టు, పువ్వులు పెట్టుకున్నట్టు, నిద్రపోతూన్నట్టు మొదలైన భంగిమాలలో అనేక రేఖాచిత్రాలు గల పుస్తకం చూపించాడు. సావిత్రి తన్మయత్వంతో చూసి "మన పెళ్లెప్పుడూ?" అంది. ఉమాకాంతం చెప్పబోతూండగా "మాఅమ్మ పిలుస్తుంది" అని భయపడుతూ పారిపోయింది.

ఉమాకాంతం షికారు వెళ్లాడు. అతను పొలాలలో తిరుగుతున్నాడు. కోత లయిపోయి చేలు తిరగడానికి ఎంతో బాగున్నాయి. కాని అతని మనస్సు అక్కడ లేదు. అతను ఏవేవో ఊహాహర్మ్యాలు కడుతున్నాడు. దృష్టి నడకమీద లేక సన్నని చేనిగట్టు మీద స్లిప్పర్లు జారగా కిందికి రెండుసార్లు పడ్డాడు. కాని చేతులు, బట్టలు దులిపేసుకుని ఎప్పటిలాగే ఆలోచిస్తూ నడుస్తున్నాడు. మరికొంచెంసేపు నడిచి ఇంటికి వెళిపోయాడు.

సావిత్రి ఉమాకాంతంఇంటికి వెళుతూన్నట్టుగా సావిత్రితండ్రికి సవతితల్లి చెప్పింది. తండ్రి సావిత్రి నడిగాడు "నిజమేనా?" అని. సావిత్రి మాట్లాడలేదు. "ఈ బొమ్మకి చట్రం ఎవరు కట్టించారు?" అన్నాడు తండ్రి. సావిత్రి మాట్లాడలేదు. తండ్రి ఆ పటం తీసి చట్రం అద్దం బద్దలుకొట్టి పారేశాడు. "ఈ మారు ఇంట్లోంచి కదిలేవంటే చూడు, పక్క ఎముకలు విరగకొడతా" అంటూ చూపుడు వేలు కదిలించాడు. సవతితల్లి సావిత్రి ఇంట్లో పనులు తిన్నగా చెయ్యడంలేదనీ, ఏ పనిచేసినా పారపాల్లే అనీ కొన్ని నేరాలు చెప్పింది. తండ్రి సావిత్రిని తిట్టి "ఈ మారు ఇంట్లోంచి కదిలేవంటే జాగ్రత్త!" అన్నాడు. సావిత్రి గదిలోకి వెళ్లిపోయి చాపమీద బోర్లా పడుక్కొని కుమిలికుమిలి ఏడ్చింది. మన్నాడు ఉమాకాంతానికి ఈ విషయం నూకమ్మ చెప్పింది. అతను గదిలో దొర్లిదొర్లి రాగాలు పెట్టాడు.

ఎవరికీ కనపడకుండా సావిత్రి ఒకసారి ఉమాకాంతంఇంటికి వెళ్లింది. "నన్ను ఎక్కడికేనా తీసుకుపోండి" అని అతనితో కన్నీళ్లతో చెప్పింది. ఉమాకాంతం ఆమెకన్నీళ్లు తుడిచి "అలాగే వెళిపోదాం. ఇంకా నువ్వు ఈడువచ్చినదానివి కాలేదు కాదూ. ఈడు వచ్చినవెంటనే పోదాం" అన్నాడు. సావిత్రి తలఊపింది. "ఈమారు నిన్ను కనక మీనాన్న కొడితే వాణ్ణి ముక్కలుచేసేస్తా" అన్నాడు ఉమాకాంతం. సావిత్రి ఉమాకాంతంనోరు నొక్కింది. ఉమాకాంతం ఆమెని కాగిలించుకున్నాడు. సావిత్రి మరికొంచెంసేపు ఉండి ఇంటికి వెళిపోతా నని చెప్పి వెళిపోయింది.

సావిత్రి ఉమాకాంతంఇంటికి వెళ్లినట్టుగా సవతితల్లివల్ల తండ్రికి తెలిసింది. తండ్రి నాలుగు

తన్నాడు. "ఇంక దీన్ని ఈ ఊళ్లో ఉంచితే నా మర్యాద దక్కదు. విజయనగరంలో మాబావమరిది ఇంట్లో దిగబెట్టేస్తాను" అని నిశ్చయంతో అన్నాడు.

సావిత్రి ఆ విషయం ఉమాకాంతానికి తెలియ పరిచింది. ఉమాకాంతం ఆమెతో "రేపు ఎవరికీ చెప్పకుండా బెజవాడ వెళిపోదాం" అన్నాడు. సావిత్రి ఒప్పుకుంది. ఉమాకాంతం అవసరమైన ఏర్పాటు లన్నీ చేసి సావిత్రికోసం ఎదురు చూశాడు. ఇద్దరూ బెజవాడ చేరుకున్నారు. కన్యకా అమ్మవారి సత్తరవులో మకాంచేశారు.

సావిత్రిఇంట్లో నానాగోలగానూ ఉంది. తండ్రీ, అతని మిత్రులూ కలిసి ఊరల్లా వెతికారు. ఉమాకాంతంకూడా ఇంట్లో లేకపోవడంవల్ల ఇద్దరూ కలిసి పారిపోయా రని ఊహించి నలుగురూ నాలుగు మూలలా రైళ్లమీద, బస్సులమీద, బళ్లమీద బయలు దేరారు. ఎలాగో ఆరాతీసి సావిత్రితండ్రి బెజవాడ చేరి సత్తరవులో ఉన్న సావిత్రిని పట్టుకున్నాడు. ఆ సమయాన్ని ఉమాకాంతం ఇంట్లో లేడు, బజారు పనిమీద ఊళ్లోకి వెళ్లాడు. సావిత్రితండ్రి సావిత్రిని బలవంతంగా బండిమీద కూచోబెట్టి తిరిగి రాజమహేంద్రవరం రాకుండా తిన్నగా విజయనగరం తీసుకుపోయాడు; బావమరిదిఇంట్లో దిగబెట్టేశాడు.

ఉమాకాంతం సత్తరవుకి వచ్చి ఉట్టిగది చూసి, సంగతులు తెలుసుకొని, దుఃఖించి రాజమహేంద్రవరం వచ్చేశాడు. సావిత్రి ఊళ్లో లేదు. క్రమేపీ ఆమె విజయనగరంలో ఉంచబడ్డట్టు విషయం తెలిసింది. విజయనగరం వెళదామని తొందరపడ్డాడు. తన దగ్గిర దమ్మిడీ లేదు. ఎలాగ దేవుడా అంటూ అతను చింతలో మునిగిపోయాడు. తనవిషయం తలచుకుని తలచుకుని గది అంతా దొర్లి దొర్లి ఏడ్చాడు. సావిత్రి తండ్రిని చంపేద్దా మనుకున్నాడు. మొదట సావిత్రిని కలుసుకోవాలని తొందరపడ్డాడు. తన దగ్గిర డబ్బు లేదుకదా, ఈ గండం తప్పడ మెలాగ?

ఒకనాటి సాయంత్రం విచారంగా ఇల్లు కదిలి షికారువెళ్లి ఆలకట్టుతోటల అవతల గోదావరిఒడ్డున కూచున్నాడు. దూరాన్ని ఎవరో ఒకాయన కూచున్నాడు. ఉమాకాంతం తన మనస్సులో ఎర్రటి సూర్యుడు తన్ను వెక్కిరిస్తున్నా డనుకున్నాడు. అరుస్తూ వెళుతూన్న కొంగ తన్ను వేళాకోళం చేస్తూన్నట్టుగా కనబడింది. చలిగాలి తననే ప్రత్యేకంగా గుచ్చుతూన్నట్టు అతనికి అనిపించింది. అతను దిగులుతో మరికొంచెంసేపు కూచుని అక్కడ ఉండడానికి ఇష్టపడక, లేచి, ముందుకి నడక సాగించి దూరాన్ని కూచున్న మనిషిదగ్గరికి వెళ్లాడు. అక్కడ పాతికేళ్ల యువకు డున్నాడు. అతనిమొహం అమాయికంగా కనబడింది. తన మొహానికీ అతనిమొహానికీ ఉండే వార చూసి ఉమాకాంతం నివ్వెరపోయాడు. ఉమాకాంతానికి అతని దగ్గిర కూచోడమే కొంతభారం తగ్గేటట్లు కనబడగా ఆ కొత్తమనిషిఅనుజ్ఞ లేకుండా అతనిపక్కని కూచున్నాడు; తాను ఎరగని కొత్తమనిషిదగ్గిర కూర్చొన్నందుకు ఆశ్చర్యపడ్డాడు. ఇంతట్లో కొత్తాయన "తమ దేఊరు?" అన్నాడు. "నాది ఈఊరేనండి" అని జవాబుచెప్పి "తమదో?" అని అడిగాడు. "నాదీ ఈఊరే" అన్నాడు ఆయన. ఉమాకాంతం మొహంలోని దీనత్వంలోంచి చిరునవ్వు తొంగిచూసి మాయమయింది. మరొకక్షణం ఊరుకుని ఉమాకాంతం "నాస్నేహితు డొక డున్నాడు. అతని దీనదశవల్ల నాకడుపులో తీరని బాధగా ఉంది. ఆ కథ చెప్తాను వింటారా?" అని అడిగాడు. కొత్తాయన ఊంకొట్టాడు. ఉమాకాంతం ఇలాగ చెప్పాడు: "నే నతని కథ రెండు ముక్కల్లో చెప్తాను. అంతకంటె చెప్పడానికి నాకు చాలా బాధగా ఉంటుంది. ఈ రెండు ముక్కలయినా నే నెంతో ఓర్చుకుని చెప్తున్నా" అన్నాడు.

కొత్తాయన ఉత్కంఠతో చూశాడు.

ఉమాకాంతం "నాస్నేహితుడు చిత్రకారుడు. అతను ఈడురాని ఒక పిల్లని వలచాడు. ఆ పిల్ల అతన్ని వలచింది. ఇద్దరూ ఈ ఊళ్లోనే ఉన్నారు. ఆ పిల్లతండ్రికి ఆ విషయం తెలిసి ఆ అమ్మాయిని విజయనగరం పంపించేశాడు. నా స్నేహితుడి ఏడ్పు చూడలేక నేను ఇలాగ వచ్చేశాను. అతను విజయనగరం వెళతా నంటున్నాడు" అన్నాడు.

"అయ్యో! ఎంతపని! తండ్రివల్ల జరిగిన అపకారమా ఇది! మీరు చెప్తేనే నా మనస్సులో ఎంతో విచారంగా ఉంది. మీ స్నేహితుణ్ణి కంటితో

చూస్తున్న మీకు ఎంత బాధగా ఉంటుందో చెప్పాలా!" అన్నాడు విచారంగా.

"నా స్నేహితుడు విజయనగరం వెళ్తా నంటున్నాడు. నాదగ్గిర కానీ లేదు. డబ్బు ఇప్పట్లో వచ్చే సూచనలు లేవు" అన్నాడు ఉమాకాంతం దుఃఖంతో.

"నేనూ భాగ్యవంతుణ్ణి కానుగాని, నాకు చేతనయినంత సహాయం చేస్తాను. క్రమేపీ నాసొమ్ము నాకు ఇద్దురుగాని" అన్నాడు కొత్తాయన.

"భగవంతుడే మిమ్మల్ని నాకు చూపించాడు. అంతకంటే ఏమీ చెప్పను" అన్నాడు ఉమాకాంతం విచారమేఘాన్ని చీల్చుకువస్తున్న ఆనందంతో.

"ఒక పదిరూపాయిలు సరిపోతాయా?"

"పని జరగడానికి చాలు"

"నాతో మాఇంటికి రండి, సొమ్ము ఇస్తాను." అన్నాడు కొత్తాయన; అంటూ లేవబోయాడు. అతన్ని చెయ్యిపట్టుకుని ఉమాకాంతం ఆపి "నేను ఆడిన చిన్న అబద్ధానికి నన్ను క్షమించండి. నా దీనస్థితి నేను మీతో తిన్నగా చెప్పుకోలేక ఒక స్నేహితుడి పేరు పెట్టి చెప్పాను. ఆ స్నేహితుడు నేనే. దీనికి నన్ను క్షమించాలి" అన్నాడు దీనంగా.

ఆ కల్పనకి ఆయన అత్యాశ్చర్యపడ్డాడు. "ఔను నిజమే. మొదట్లో చెప్పుకోడానికి సిగ్గువేస్తుంది. మీరేనా! నాకు మరీ జాలివేస్తూంది. నాతో ఇంటికి రండి. పైకం ఇస్తాను" అని చెప్పాడు సానుభూతితో.

ఉమాకాంతం ఆయనతో "మిమ్మల్ని చూసినప్పుడే ఎంచేతో మీకు నాకథ చెప్పా లనిపించింది. భగవంతు డిలా దోవ చూపించాడు" అన్నాడు ఆనందాశ్రువులతో.

కొత్తాయన "ప్రేయసుల యొక్క ఊహాసౌధాలే ఇటువంటి కొన్నిటికి కారణం. వాళ్లు ప్రతీదాన్నీ అనుమానించి ప్రయత్నం మానుకోరు. వారి ఊహే కొన్ని విషయాల్లో రక్షిస్తుంది" అన్నాడు ఉత్సాహంతో.

దారిలో ఉమాకాంతం కొత్తాయనపేరు కనుక్కున్నాడు. ఆయన పేరు చంద్రశేఖర రావు.

కొత్తమిత్రు డిచ్చిన డబ్బు పుచ్చుకుని ఉమాకాంతం ఆ రాత్రి పాసెంజరు అందుకుని విజయనగరం వెళ్లాడు. కానుకుర్తివారి సత్తరవులో దిగాడు. సావిత్రి మేనమామ ఇల్లు కనుక్కొని వెళ్లాడు. మేనమామ ఇంట్లో ఉన్నాడు. అతను ఉండగా తాను వెళ్లడం వ్యర్థమని తలచి తిరిగి బసకి వచ్చేశాడు.

సావిత్రి మేనమామ ఆ ఊళ్లో సంస్థానంఇలాఖాలో ఓవర్శీరుగా పనిచేస్తున్నాడు. ఆ నెలలో అతను ఇంకా ఊళ్లవెంబడి వెళ్ల లేదు. మరినాలుగు రోజులికి సర్కీటు వెళిపోయాడు. ఇంట్లో అతని భార్య, చిన్నకొడుకు, సావిత్రి ఉన్నారు. ఉమాకాంతం వాళ్ల ఇంటికి వెళ్లాడు. ఉమాకాంతాన్ని చూసి సావిత్రి తన ప్రాణం తిరిగివచ్చినట్టుగా ఆనందించింది. చుట్టుపట్ల ఎవరూ లేకపోగా అతన్ని కౌగిలించుకుని ఏడ్చింది. ఉమాకాంతం ఆమెయోగక్షేమాలు తెలుసుకొని ఆనందించాడు. ఇంతట్లో ఇంటిలోంచి ఆమెఅత్త వచ్చింది. సావిత్రి ఆమెతో "మా ఇంటి ఎదుట ఉన్న మానాన్న స్నేహితులు. మా ఇంట్లో మనిషిలాగే మెసులుతూ ఉంటారు" అని చెప్పింది. అత్త సంతోషించింది. అత్తయొక్క బలవంతంమీద ఉమాకాంతం ఆ ఇంట్లో రెండురోజు లున్నాడు. సావిత్రి స్వర్గసుఖం పొందింది. ఉమాకాంతం తన దుఃఖాలన్నీ మరిచిపోయాడు. అతను ఆ ఊళ్లో బసలో మరినాలుగురోజులుండి అప్పుడప్పుడు వచ్చి సావిత్రిని చూస్తూండేవాడు. సావిత్రి వివాహం సంగతి అడిగింది. త్వరలోనే చేసుకుందా మని చెప్పాడు అతను. సావిత్రి విజయనగరంలో సుఖంగా ఉంటూన్నందుకు సంతోషించి రాజమహేంద్రవరం వచ్చేశాడు.

ఉమాకాంతం చంద్రశేఖరరావుతో సావిత్రిని గురించి చెప్పి ఆనందించాడు. మిత్రుడి ప్రయత్నం కొంత సఫల మయినందుకు చంద్రశేఖరరావు సంతోషించాడు. ఉమాకాంతం సావిత్రిబొమ్మని చూసి, ఆమె వెనక రాసిన ప్రేమలేఖ చూసి ఆమెని చూసినట్టుగానే ఆనందిస్తూ కాలం గడుపుతున్నాడు.

ఒకనాడు ఉమాకాంతానికి సావిత్రి దగ్గిరనుంచి జాబొకటి వచ్చింది. ఆ జాబు చదివి అతను దుఃఖం పట్టలేకపోయాడు. ఉమాకాంతం విజయనగరం వచ్చినట్టు అక్కడివాళ్లకీ, ఇక్కడివాళ్లకీకూడా తెలిసి తనకి మరింత ఖాయిదా జరుగుతూందనీ, అంచేత ఈ మాటు విజయనగరం వచ్చినప్పుడు అందరికీ కనపడవద్దనీ, తనకి

తన తండ్రి ఒక సంబంధం కుదిర్చాడనీ, అంచేత తనని వేగిరమే అక్కడినుంచి తీసుకుపోవలసిందనీ, కార్డు దొరక్క ఈ ఉత్తరం రాయడమే ఎంతో కష్ట మయిపోయిందనీ సావిత్రి ఆ ఉత్తరంలో రాసింది. ఉమాకాంతం దుఃఖించి ఆజాబు తీసుకువెళ్లి చంద్రశేఖరరావుకి చూపించాడు. సంగతులు తెలుసుకొని అతను కూడా దుఃఖించాడు. ఉండే పరిస్థితుల్లో ఏమి చెయ్యడానికీ తనకి తోచడం లేదనీ, చెయ్యవలసిందేమిటో చెప్పమనీ ఉమాకాంతం కోరాడు. మిత్రుడు ఇలాగ చెప్పాడు: "నువ్వు ఆ అమ్మాయిని విజయనగరంనుంచి ఇక్కడికి తీసుకురా. పిల్ల ఊతారుగా ఉంటుంది కాబట్టి పదహారే ళ్లుంటాయని చెప్పి వీరేశలింగంగారి తోటలో రహస్యంగా పెళ్లి జరిపిద్దాం." ఈ ఆలోచన ఎంతో చక్కగా కనబడింది ఉమాకాంతానికి. అతను అప్పటికి ఇంటికి వెళిపోయి సాయంత్రం ఒక తైలవర్ణ పటంతోటి చంద్రశేఖర రావుదగ్గరికి వచ్చాడు. "ఈ మధ్య నేను చేసిన పని ఇది. నువ్వు నాకు చేసిన సహాయానికి నేను చెయ్యగలిగిన పని ఇది" అని ఆపటం చంద్రశేఖరరావుకి నేమానిగా ఇచ్చాడు. అది చంద్రశేఖరరావు బొమ్మ. నడుం వరకూ ఉన్నది. చంద్రశేఖరరావు తన ప్రతిరూపం చూసి మిత్రునియొక్క చిత్రకళానైపుణ్యానికి ఆశ్చర్యపడి "మొదట మనం చూడవలసింది సావిత్రిని ఇక్కడికి తీసుకురావడం. ఆ విషయమై నీకు ఇప్పుడు ఎంత కావాలో చెప్పు, ఇస్తాను" అన్నాడు. ఉమాకాంతం పదిహేనురూపాయిలు కోరాడు. చంద్రశేఖరరావు వెంటనే ఇచ్చాడు. ఉమాకాంతం అప్పుడే రైలుకి బయలుదేరాడు.

ఉమాకాంతం విజయనగరం కూడా వెళ్లి సావిత్రిని కలుసుకున్నాడని సావిత్రితండ్రికి తెలియగానే అతను అత్యాశ్చర్యపడి, సావిత్రికి పెళ్లిసంబంధం కోసం మరింత త్వరపడ్డాడు. తండ్రి వైదికవృత్తిలో ఉండి, స్కూల్ ఫైనల్ పాసయిన ఒక యువకుడికి — అతని పేరు రామబ్రహ్మం, అంటే మామిత్రుడు — ఆమె నిచ్చి పెళ్లి చెయ్యదలచుకున్నాడు. సావిత్రికి పెళ్లిమాట చెప్పకుండా, ఆమెకి వరుణ్ణి చూపించకుండా సంబంధం సిద్ధంచేసి, ఆమెని విజయనగరం నుంచి రాజమహేంద్రవరం తీసుకువచ్చాడు. మొగ పెళ్లివారంతా రాజమహేంద్రవరం వచ్చారు. ఈ స్థితి అంతా ఉమాకాంతానికి తెలిసిందో లేదో అని సావిత్రి దుఃఖించింది. ఆమె కేవలం బందీగా ఉంది. ఎటు పోవడానికి, ఏమి మాట్లాడడానికి, ఏమి చెయ్యడానికీ ఆమెకి స్వేచ్ఛ లేదు.

ఉమాకాంతం విజయనగరం వెళ్లాడు. అక్కడ సావిత్రిసంగతిగాని, వాళ్లు ఎక్కడికి వెళ్లిన విషయం గాని చెప్పినవాళ్లు లేరు. అతను ఈ మోస్తరుగా నాలుగైదురోజులు ఆ ఊళ్లో గడిపి రాజమహేంద్రవరం వచ్చాడు సంగతులు తెలుసుకుందామని.

రామబ్రహ్మంతో సావిత్రికి ఏకరాత్రి వివాహం జరిగింది. ఈ విషయం తెలిసిన ఉమాకాంతం దుఃఖసముద్రంలో మునిగిపోయాడు. అతను చంద్రశేఖర రావుదగ్గరకి వెళ్లడం మానేశాడు.

వివాహ మయినవెంటనే సావిత్రిని తండ్రి మళ్లా విజయనగరం పంపేశాడు. ఉమాకాంతం ఉన్మత్తుడిలాగ తిరుగుతూ రాజమహేంద్రవరంలోనే ఉండిపోయాడు.

మరి మూడునెల్లకి సావిత్రి పెద్ద మనిషయింది. అయిన వెంటనే రామబ్రహ్మం కాపురంచేసుకుని తన ఊరు తీసుకుపోయాడు.

దసరాపండగకి సావిత్రి రాజమహేంద్రవరం వచ్చింది. ఉమాకాంతం ఎంతో ప్రయత్నం చేసి ఆమెని కలుసుకుని "మరి, మనం ఏమిటిచేద్దాం ఇప్పుడు? నీఅభిప్రాయం చెప్పు" అని అడిగాడు. కాని సావిత్రి "అమాయికంగా నన్ను వివాహమాడిన ఆయన్ని నేను మోసం చెయ్యను. నానుదుటిరాత ఇంతే" అని ఇంట్లోకి చర్రున వెళిపోయింది. ఉమాకాంతం స్మృతి లేక కొంతసేపు నిలుచుని, తెలివి తెచ్చుకుని, విచారంతో వెళిపోయాడు.

నాటికీ నేటికీ ఉమాకాంతం వివాహం చేసుకోలేదు. తన దగ్గర ఉన్న సావిత్రిబొమ్మనీ, సావిత్రి ప్రేమలేఖనీ రహస్యంగా ఆరాధిస్తూ కాలం గడుపుతున్నాడు.